# ఏపీలో ఆస్ట్రేలియన్ పెట్టుబడులు

## ముఖ్యమంత్రిని కలిసిన కాన్సుల్ జనరల్ షాన్ కెల్లీ

అమరావతి, ఆగస్ట్ 8 : గనులు, రహదారి రవాణా, విద్య తదితర రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు తమ దేశానికి చెందిన పారిశ్రామికవేత్తలు ఆసక్తిగా ఉన్నారని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ షాన్ కెల్లీ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధి బృందంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. ఏపీలో త్వరలో విశ్వవిద్యాలయం లేదా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. దీనిపై త్వరలోనే అవగాహన ఒప్పందం చేసుకుంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన హైరిజల్యూషన్ జియోలాజికల్ మ్యాపింగ్ ఏర్పాటుకు దోహదం చేసే సర్వే అసిస్టెన్స్ సిస్టమ్ కోసం పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, దీనిపై కూడా త్వరలో ఎంవోయూ చేసుకోబోతున్నామని చెప్పారు. ఆస్ట్రేలియా, ఏపీ మధ్య పరస్పర సహాయ సహకారాలు పెంపునకు కృషిచేస్తున్నామని అన్నారు. వివిధ రంగాలలో తమకున్న నైపుణ్యం, అనుభవం కొత్త రాష్ట్రానికి ఏవిధంగా ఉపకరిస్తుందో పరిశీలించి తగిన భాగస్వామ్యం తీసుకుంటామన్నారు.

రోడ్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ అంశంపై ఏపీ ప్రభుత్వంతో ఇప్పటికే కలిసి పనిచేస్తున్నామని షాన్ కెల్లీ చెప్పారు. ప్రపంచ బ్యాంకు సహాయంతో ఏఆర్ఆర్‌బీ ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల సర్వే చేపడుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధికి ఆస్ట్రేలియాలో అమలులో ఉన్న ఉత్తమ పద్ధతులను ఇక్కడ పరిచయం చేస్తామని చెప్పారు. ఏపీలోని మారుమూల గ్రామాలలో ఎటీఎం సదుపాయం కల్పించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తామని తెలిపారు.

ఏపీతో కొన్ని అంశాలలో కలిసి పనిచేసేందుకు సన్నద్ధమవుతున్నట్టు క్వీన్స్‌ల్యాండ్ ప్రతినిధి శాండ్రా డెల్లెమ్ చెప్పారు. నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, అభివృద్ధి ప్రణాళిక, ఉన్నత లక్ష్యాల పట్ల ఆకర్షితులై ఇక్కడికి వచ్చామని అన్నారు.